క్లుప్తంగా

ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్‌నాయక్



శిక్షణ పొందుతున్న మహిళలతో ఈడీ అర్జున్ నాయక్

మార్కాపురం: మహిళలకు ఉపాధి కల్పించే శిక్షణ కోర్సులను సద్వినియోగం చేసుకోవాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్‌నాయక్ సూచించారు. మంగళవారం తర్లుపాడు రోడ్డులోని సెరీ కల్చర్ కార్యాలయంలో ఎస్సీ కమ్యూనిటీ మహిళలకు కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. శిక్షణ అనంతరం కుట్టుమిషన్లు ఇస్తామని ఈడీ చెప్పారు. కార్యక్రమంలో ట్రైనర్ సుల్తాన్ బాషా, మహబ్బీ, కోఆర్డినేటర్ ఫిరోజ్ పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపోకు ఆదాయం పెంచాలి



సిబ్బందికి చెక్ అందిస్తున్న డీఎం నరసింహులు

మార్కాపురం: ఆర్టీసీ డిపోకు ఆదాయం పెంచేందుకు సిబ్బంది కృషి చేయాలని డిపో మేనేజర్ ఏఎస్ నరసింహులు కోరారు. మార్కాపురం ఆర్టీసీ డిపోకు ఆదాయం తెచ్చేందుకు కృషి చేసిన పలువురు ఉద్యోగులను మంగళవారం సన్మానించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన కండక్టర్లు రంగయ్య, సుబ్రమణ్యం, పద్మజ, కేఎల్ నారాయణ, డ్రైవర్లు సీహెచ్ విశ్వనాథ్, జీవీరెడ్డి తదితరులను డీఎం అభినందించి నగదు పురస్కారాలు అందజేశారు. వీరిని ఆదర్శంగా తీసుకుని మిగిలిన ఉద్యోగులు డిపో ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.


బ్యాంకు రుణాలపై అవగాహన



ఖాతాదారులతో మాట్లాడుతున్న బ్యాంక్ మేనేజర్

గిద్దలూరు రూరల్: ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ రుణాలపై ఖాతాదారులు అవగాహన కలిగి ఉండాలని మేనేజర్ రామ్మోహన్ సూచించారు. మండలంలోని అంబవరం గ్రామంలో మంగళవారం జన్ సురక్ష కార్యక్రమంలో భాగంగా బ్యాంక్ రుణాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ బ్యాంక్‌లో రుణాలపై తక్కువ వడ్డీలను తీసుకోవడమే కాకుండా డిపాజిట్‌దారులకు అన్ని బ్యాంకుల కన్నా వడ్డీ రేటు అధికంగా చెల్లిస్తున్నామని చెప్పారు. జన్ సురక్ష ఇన్సూరెన్స్ పథకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్లు హరినాథ్, సందీప్, సిబ్బంది పాల్గొన్నారు.


డెంగీపై అప్రమత్తంగా ఉండాలి



ఉప్పలపాడులో అవగహన ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

పొదిలి రూరల్: సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశమున్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఉప్పలపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి సుగణకుమార్ సూచించారు. సోమవారం ఉప్పలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి డెంగీ వ్యాధి నివారణపై గ్రామంలో అవగహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ.. టైగర్ దోమ వల్ల డెంగీ వ్యాప్తి చెంది జ్వరం, తలనొప్పి, చలి, కళ్లు ఎర్రపడటం లక్షణాలు కనిపిస్తాయని, రక్త కణాలు తగ్గిపోతాయని చెప్పారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎ.వెంకటేశ్వర్లు, వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌ను ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు



సంఘటన స్థలంలో క్షతగాత్రుడు

మార్కాపురం టౌన్: టూవీలర్‌పై ప్రయాణిస్తున్న గుర్తు తెలియని వ్యక్తి మార్కాపురం రైల్వే ఓవర్ బ్రిడ్జిపై ఫుట్‌పాత్‌ను ఢీకొని పడిపోవడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. మార్కాపురం నుంచి పొదిలి వైపు టూవీలర్‌పై వెళ్తున్న వ్యక్తి ఆర్‌ఓబీపై ఫుట్‌పాత్‌ను ఢీకొట్టాడు. స్థానికుల సమాచారంతో క్షతగాత్రుడిని 108లో జీజీహెచ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై అంకమరావు తెలిపారు. క్షతగాత్రుడి వివరాలు తెలిసిన వారు 91211 02183ను సంప్రదించాలని సూచించారు.

కవర్‌కే పవర్.. హెచ్చరికలు బేఖాతర్..!



ప్లాస్టిక్ కవర్లలో సరుకుల సరఫరా



కూరగాయలు తీసుకెళ్తూ..



చిన్న కవర్లలో ఇలా..



ప్లాస్టిక్ కవర్లు

మార్కాపురం: ప్లాస్టిక్ కవర్ల నిషేధం మూణ్నాళ్ల ముచ్చటగానే మిగిలిపోతోంది. గ్లోబల్ వార్మింగ్ హెచ్చరికల నేపథ్యంలో పర్యావరణానికి హాని కలిగించే 20 మైక్రాన్ల కంటే తక్కువ ఉన్న ప్లాస్టిక్ కవర్లను ప్రభుత్వం, కోర్టులు నిషేధించాయి. వీటి వినియోగానికి అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తుండటంతో వ్యాపారులు, ప్రజలు యథేచ్ఛగా ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తున్నారు. మార్కాపురంలో ఈ ఏడాది ప్రారంభంలో మున్సిపల్ అధికారులు వ్యాపారులతో సమావేశాలు నిర్వహించి ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని నిషేధించాలని సూచించారు. మొదట్లో దాడులు నిర్వహించి, ఆ తర్వాత వదిలేయడంతో ప్లాస్టిక్ కవర్ల వినియోగం మళ్లీ ఊపందుకుంది. ప్లాస్టిక్ కవర్లలో ఆహార వ్యర్థాలు ఉంచి వీధుల్లో పడేస్తుండటంతో మూగజీవాలు వాటిని తిని ప్రాణాలమీదకు తెచ్చుకుంటున్నాయి.

దాడులు చేసినా ఆగని విక్రయాలు

పురపాలక సంఘం పరిధిలో ప్లాస్టిక్ కవర్ల నిషేధాన్ని మున్సిపల్ కమిషనర్, శానిటరీ విభాగం పర్యవేక్షించాల్సి ఉంటుంది. నామమాత్రంగా దాడి చేసి వదిలేయడంతో ఇదే అవకాశంగా భావించిన హోల్‌సేల్ వ్యాపారులు కొందరు గుట్టుచప్పుడు కాకుండా విక్రయాలు సాగిస్తున్నారు.

ప్రజా సమస్యలపై దృష్టి సారించండి

- హాస్టళ్లలో విద్యార్థుల అవస్థలు, గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలి
- మనబడి నాడు–నేడు పెండింగ్ పనులు పూర్తి చేయాలి
- అధికారులకు మండల పరిషత్ సభ్యుల సూచన



మాట్లాడుతున్న ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యుడు



సమస్యలపై ప్రశ్నిస్తున్న వైస్ ఎంపీపీ మెట్టు వెంకటరెడ్డి



నీటి సమస్యపై మాట్లాడుతున్న వద్దిమడుగు సర్పంచ్

కొనకనమిట్ల: రాజకీయాలకు అతీతంగా ప్రజా సమస్యల పరిష్కారానికి, గ్రామాల అభివృద్ధికి మండల స్థాయి అధికారులు కృషి చేయాలని ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశాన్ని ఎంపీడీఓ ఈశ్వరమ్మ నిర్వహించారు. వైస్ ఎంపీపీ మెట్టు వెంకటరెడ్డి, గొట్లగట్టు ఎంపీటీసీ, మాజీ ఎంపీపీ ఉడుముల రామనారాయణరెడ్డి మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారంలో అధికారుల తీరు ఏమాత్రం బాగోలేదన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గ్రామాల్లో చేపట్టే పనులపై స్థానిక ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వకపోవడాన్ని ఆక్షేపించారు. ఏ హోదా లేనివారిని ఎలా పిలుస్తున్నారని ప్రశ్నించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో చేపట్టిన మనబడి నాడు–నేడు పనులను ఏడాదిగా నిలిపేయడంతో సరైన వసతులు లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సభ దృష్టికి తీసుకొచ్చారు.

కొనకనమిట్ల, గొట్లగట్టు, పెదారికట్ల గ్రామాల్లోని హాస్టళ్లలో మౌలిక వసతులు కల్పించి, విద్యార్థుల ఇబ్బందులు తీర్చాలని అధికారులకు సూచించారు. ఉపాధి హామీ పథకం పనుల్లో అవకతవకలు చోటుచేసుకుంటున్నా అధికారులు స్పందించకపోవడం సరికాదన్నారు. మండల పరిషత్ సమావేశాలకు తహసీల్దార్ సురేష్ ఒక్కసారి కూడా హాజరుకాకపోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. పిల్లలకు సర్టిఫికెట్ల జారీ విషయంలో తహసీల్దార్ ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులను కూడా మండల సమావేశానికి వచ్చేలా చర్యలు తీసుకోవాలని సభ్యులు సభ దృష్టికి తెచ్చారు. వివిధ శాఖల అధికారులు తమ నివేదికలను సభ్యులకు వివరించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ గొంగటి జెనీఫా, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నకిలీ ఉత్పత్తులు విక్రయిస్తే కఠిన చర్యలు



బేస్తవారిపేటలో రికార్డులు తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు



గిద్దలూరులో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

- ఎరువుల డీలర్లకు విజిలెన్స్ అధికారుల హెచ్చరిక

బేస్తవారిపేట: రైతులకు విత్తనాలు, పురుగుమందులు, ఎరువులు విక్రయించినప్పుడు తప్పనిసరిగా రశీదులివ్వాలని స్టేట్ స్క్వాడ్ టీమ్ అధికారి టి.శ్రీనివాసరావు సూచించారు. మంగళవారం బేస్తవారిపేటలోని పలు ఎరువులు, పురుగుమందుల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. సర్టిఫైడ్ డీలర్ల వద్దనే రైతులు విత్తనాలు, పురుగుమందులు కొనుగోలు చేయాలని తెలిపారు. నకిలీ విత్తనాలు, పురుగుమందులు అమ్మితే కఠిన చర్యలు తప్పవని డీలర్లను హెచ్చరించారు. తనిఖీలో విజిలెన్స్ సీఐ షేక్ సుబానీ, ఒంగోలు సాంకేతిక వ్యవసాయాధికారి శ్రీనివాసనాయక్, ఏడీఏ షేక్ మహబూబ్ బాషా, ఏఓ షేక్ అబ్దుల్ రఫీక్ పాల్గొన్నారు.

గిద్దలూరులో విక్రయాలు నిలిపివేత

గిద్దలూరు రూరల్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో గల చీతిరాల, కృష్ణా ట్రేడర్స్ ఎరువు దుకాణాలను విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. చీతిరాల దుకాణంలో ప్రిన్సిపల్ సర్టిఫికెట్లు అందుబాటులో లేని కారణంగా 34 టన్నుల ఎరువులు, కృష్ణా ట్రేడర్స్‌లో 91 లీటర్ల పురుగుమందుల విక్రయాలు నిలిపివేశారు. అధికారుల వెంట గిద్దలూరు ఏఓ విజయభాస్కర్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొమరోలు: మండలంలో నూతనంగా విద్యుత్ లైన్లు ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో కొమరోలు సబ్‌స్టేషన్ పరిధిలోని కొమరోలు, చింతలపల్లి, సూరవారిపల్లి గ్రామ పంచాయతీల్లో బుధవారం ఉదయం 8.30 నుంచి ఒంటి గంట వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ శ్రీనివాసులు తెలిపారు. అలాగే రాజుపాలెం సబ్‌స్టేషన్ పరిధిలోని ముక్తాపురం అగ్రికల్చరల్ ఫీడర్‌లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి, విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని మంగళవారం ఓ ప్రకటనలో కోరారు.

ఫైప్ కల్వర్టు ఏర్పాటు చేయాలి



కల్వర్టు నిర్మించాల్సిన ప్రాంతమిదే..

పొదిలి: పెద్దవాగుపై నందిపాలెం పరిధిలో పైపు కల్వర్టు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. నందిపాలెం నుంచి ఒంగోలు–కర్నూలు రాష్ట్రీయ రహదారికి చేరుకునే ఈ లింక్ రోడ్డును ప్రధానంగా వ్యవసాయ పనుల కోసం రైతులు వినియోగిస్తుంటారు. గతంలో ఏర్పాటు చేసిన పైపు కల్వర్టు వర్షాల సమయంలో వరద ఉధృతికి కొట్టుకుపోయింది. దీంతో రాకపోకలకు సమస్యగా మారింది. నూతన పైపు కల్వర్టు ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

సర్వే ఆధారంగా స్వచ్ఛత ర్యాంక్



పీహెచ్‌సీని పరిశీలిస్తున్న కేంద్ర బృంద సభ్యులు

బేస్తవారిపేట: స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ–2025 కార్యక్రమంలో భాగంగా కేంద్ర బృందం సభ్యులు జి.రవివర్మ, ఖాజావలి స్థానిక పంచాయతీలో పర్యటించారు. పారిశుధ్యం, మురుగునీటి నిర్వహణ, తడి, పొడి చెత్త నిర్వహణ, మరుగుదొడ్ల వినియోగం, అంగన్‌వాడీ, ప్రభుత్వ పాఠశాలలు, వైద్యశాలల్లో పారిశుధ్యం, మరుగుదొడ్ల నిర్వహణపై సర్వే చేశారు. వీటి ఆధారంగా పంచాయతీకి ర్యాంక్ ఇవ్వనున్నట్లు కేంద్ర బృందంలోని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఏవీ రంగనాయకులు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

జనం 'షాక్'!



పగుళ్లిచ్చిన సిమెంట్ దిమ్మె



నీళ్ల ట్యాంక్‌పై ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

గిద్దలూరు రూరల్: గిద్దలూరు పట్టణంలో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల వెనుక విద్యుత్ శాఖ ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు జనానికి దడ పుట్టిస్తున్నాయి. ఏదైనా ప్రమాదం సంభవిస్తే ఎలా? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. బాలికల హైస్కూల్ వెనుక కాళికాంబ ఆలయం వద్ద ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు నిర్మించిన దిమ్మె కొద్ది రోజులకే పగుళ్లిచ్చింది. నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం వల్ల సిమెంట్ దిమ్మె పగుళ్లిచ్చిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. అదే ప్రాంతంలో యాక్సిస్ బ్యాంక్‌కు విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రత్యేకంగా ఒక మినీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుపై ఎలాంటి అభ్యంతరాలు రాలేదు కానీ అది ఉంచిన ప్రదేశంపై స్థానికులు, కాళికాంబ ఆలయ భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సిమెంట్ ఒరలతో కూడిన నీటి ట్యాంక్‌పై మినీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఉంచడం సరికాదని, మరో ప్రదేశంలో ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఈ విషయమై విద్యుత్ శాఖ ఏఈ నారాయణరెడ్డిని వివరణ కోరగా.. నీళ్ల ట్యాంక్‌పై ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు మంచిది కాదు. గతంలో పనిచేసిన అధికారులు అలా చేశారు. దానిని పరిశీలించి చర్యలు తీసుకుంటాం. స్తంభం తగలడం వల్ల సిమెంట్ దిమ్మెకు పగుళ్లు వచ్చాయి. త్వరలోనే మరమ్మతులు చేయిస్తాం' అని తెలిపారు.

పారదర్శక ఓటరు జాబితాతో ప్రశాంత ఎన్నికలు



మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకట శివరామిరెడ్డి

బేస్తవారిపేట: బీఎల్‌ఓలు ప్రతి కుటుంబాన్ని సందర్శించి ఓటరు జాబితాను పారదర్శకంగా తయారు చేయాలని గిద్దలూరు నియోజకవర్గ ఎన్నికల అధికారి, వెలిగొండ ప్రాజెక్ట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.వెంకట శివరామిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడానికి స్పష్టమైన ఓటరు జాబితాలు దోహదపడతాయన్నారు. విచారణ అనంతరం చనిపోయిన, వేరే ప్రాంతంలో శాశ్వతంగా స్థిరపడిన వారి ఓట్లు తొలగించాలని స్పష్టం చేశారు. ఆధార్ కార్డు లేదన్న కారణంతో ఓటు తొలగించవద్దని చెప్పారు. గృహ సందర్శన సమయంలో 18 ఏళ్లు నిండిన యువత ఉంటే ఓటు హక్కు దరఖాస్తు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ ఎ.జితేంద్రకుమార్, ఎలక్షన్ డీటీ షేక్ ఇబ్రహీం ఖలీల్ పాల్గొన్నారు.

విద్యతోపాటు నైపుణ్యం అవసరం



మాట్లాడుతున్న ఇందిరాదేవీ

మార్కాపురం టౌన్: విద్యార్థులు చదువుతోపాటు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని జూనియర్ ఎంప్లాయిమెంట్ అధికారి ఇందిరాదేవి సూచించారు. మంగళవారం స్థానిక సాధనా డిగ్రీ కళాశాలలో ప్రపంచ యువ నైపుణ్య దినోత్సవంలో భాగంగా విద్యార్థులకు మై భారత్, దీక్షా యూత్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలను అందిపుచ్చుకుని భవిష్యత్తులో మంచి ఉద్యోగాలు పొంది అభివృద్ధి చెందాలన్నారు. అనంతరం పెయింటింగు, వ్యాసరచన పోటీలు నిర్వహించిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మధుసూదన్‌శర్మ, ఆర్గనైజేషన్ అధ్యక్షుడు శ్రీధర సాయి సుబ్బారావు, సాయిలక్ష్మి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీధర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

వేతన వివక్ష ఇంకెన్నాళ్లు?



మార్కాపురం : అర్ధనగ్న ప్రదర్శనలో మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు



గిద్దలూరులో అర్ధనగ్నంగా నిరసన తెలుపుతున్న కార్మికులు

- సంక్షేమ పథకాలు, సమ్మె కాలపు ఒప్పందాలు అమలు చేయాలి
- మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన

మార్కాపురం టౌన్: మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా పేర్కొంటూ వేతనం విషయంలో వివక్ష చూపుతుండటంపై ఇంజినీరింగ్ కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల సంఘ అధ్యక్షుడు సుబ్బరాయుడు మాట్లాడుతూ.. సమస్యలు పరిష్కరించాలని మూడు రోజులుగా కార్మికులు ధర్నా చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు చిరుద్యోగులను దూరం చేశారని, వేతనం పెంపు జీఓను అమలు చేయకపోవడంతో కార్మిక కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ కార్యదర్శి హరి, నాయకులు కృష్ణ, చెన్నయ్య, శేఖర్, రషీద్ బాషా, యూసఫ్, గురునాథం, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

గిద్దలూరులో..

గిద్దలూరు రూరల్: స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ఇంజినీరింగ్ కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం అర్ధనగ్నంగా నిరసన తెలిపారు. కార్మికుల సంఘ నాయకులు మస్తాన్ రెడ్డి, మౌలాలి మాట్లాడుతూ.. మున్సిపల్ ఇంజినీరింగ్, పారిశుధ్య కార్మికులు నిరవధిక సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. జీఓ 36 ప్రకారం వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. వయో పరిమితి 62 ఏళ్లకు పెంచడంతోపాటు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, సమ్మె కాలపు ఒప్పందాలు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కృష్ణంరాజు, సలీమ్, రహ్మతుల్లా, పుల్లయ్య, నాగయ్య, రంగస్వామి, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.